క్లుప్తంగా

వీధికుక్కల బెడద నుంచి రక్షణ కల్పించండి



సంతకాలు పెడుతున్న మహిళలు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని బండిమెట్ట పబ్లిక్ టాయిలెట్ల వద్ద వీధికుక్కల సమూహం నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ సీపీఎం నాయకులు డి.పార్వతయ్య ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతినిత్యం అక్కడ వీధి కుక్కలు గుంపులు, గుంపులుగా ఉండడంతో వృద్ధులు, పిల్లలు భయాందోళన చెందుతున్నారని, వాటిని తరలించాలని పలుమార్లు మునిసిపల్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని మునిసిపల్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో పల్లవిబాయ్, లలిత, నిర్మలబాయి పాల్గొన్నారు.

పీఆర్ ఇంజినీర్స్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న పీఆర్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి, ఇంజినీర్లు

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ రూపొందించి ముద్రించిన నూతన సంవత్సర డైరీ,క్యాలెండర్లను పీఆర్ ఎస్‌ఈ వీ.రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. గురువారం స్థానిక జెడ్పీ ప్రాంగణం విశ్వేశ్వరయ్య భవన్‌లోని ఎస్‌ఈ చాంబర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రరెడ్డి, ఆర్.సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు హెచ్‌డీ ఈరన్న, కోశాధికారి పార్థసారథి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణారెడ్డి, కర్నూలు, ఆదోని ఈఈలు ఎన్‌సీఎస్ మద్దన్న, రఘురామిరెడ్డి, డీసీ వెంకటేష్, డీఈఈలు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. డైరీలో పంచాయతీరాజ్ ఇంజినీర్లకు సంబంధించి ముఖ్యమైన జీఓలు, సాంకేతిక పరమైన అంశాలు, ఇతర డాటాను పొందుపరచడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

19న రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై సదస్సు

కర్నూలు(సెంట్రల్): కామ్రేడ్ టి.నరసింహ 6వ వర్ధంతి, సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని ఈనెల 19వ తేదీన రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని సీక్యాంపు టీజీవీ లలిత కళా సమితిలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సదస్సుకు వక్తలుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ వస్తారని, ఈ సదస్సుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు.

ఏఓకు ఘన సన్మానం



నాగేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న ఈఈ, సహచర ఉద్యోగులు

కర్నూలు (అర్బన్): కర్నూలు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేంద్రకుమార్‌ను అధికారులు, సహచర ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. గురువారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈఈ మద్దన్న మాట్లాడుతూ.. విధి నిర్వహణలో క్రమశిక్షణగా వ్యవహరించే నాగేంద్రకుమార్ ఏఓగా పదోన్నతిపై పగిడ్యాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయానికి బదిలీపై వెళ్తుండటం సంతోషకరమన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

19న పుస్తకావిష్కరణ సదస్సు

కర్నూలు కల్చరల్: క్లస్టర్ యూనివర్సిటీ, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఈ నెల 19వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రముఖ రచయిత్రి డాక్టర్ తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం రచించిన 'వేకువలో.. చీకటిలో..' (కథా సంపుటి) పుస్తకావిష్కరణ సదస్సును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, గాడిచెర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర, కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల ఉపన్యాసకురాలు డాక్టర్ ఎం.ఫరీదా బేగం, తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ కర్నాటి చంద్రమౌళి, ప్రముఖ కథారచయిత డాక్టర్ హరికిషన్, నరసం కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు.

థైరాయిడ్‌తో పెను ముప్పు

- శారీరక, మానసిక సమస్యలతో సతమతం
- జిల్లాలో 15 శాతం మందికి సమస్య
- మందులు, వ్యాయామంతో నియంత్రణ
- జనవరి థైరాయిడ్ అవగాహన మాసం



కర్నూలు(హాస్పిటల్): ఏ చిన్న పని చేసినా అలసిపోతారు. చిన్న విషయానికీ కోప్పడతారు. చిన్న వయస్సులోనే కీళ్ల నొప్పులు బాధిస్తాయి. ఉన్నఫలంగా బరువు పెరుగుతారు లేదా తగ్గిపోతారు. జీవితంలో ఏదో కోల్పోయిన ఆలోచనలు నిత్యం వెంటాడుతుంటాయి. ఇలాంటి లక్షణాలు మీలో ఎవ్వరికైనా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి థైరాయిడ్ పరీక్ష చేయించుకోండి. ఇది దీర్ఘకాలిక సమస్య. ఒకసారి ఈ వ్యాధి వచ్చిందంటే జీవితాంతం మందులు వాడాల్సిందే. లేకపోతే నిత్యం ఏదో ఒక ఆరోగ్య సమస్య తలెత్తుతుంది. జనవరి నెల థైరాయిడ్ అవగాహన మాసం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ విభాగానికి ప్రతి మంగళ, శుక్రవారాలు ఓపీ సేవలు ఉంటాయి. ఇందులో థైరాయిడ్ రోగులు ప్రతి మంగళవారం 100 మంది, ప్రతి శుక్రవారం 50 మంది చికిత్స కోసం వస్తారు. వీరితో పాటు వివిధ విభాగాల నుంచి ప్రతిరోజూ పది మంది దాకా రెఫరల్స్ వస్తారు. వీరిలో గైనకాలజీ విభాగం నుంచి గర్భవతులు ఎక్కువగా ఉంటారు. పెద్దాసుపత్రితో పాటు ప్రైవేటు వైద్యుల వద్దకు సైతం ప్రతిరోజూ 150 నుంచి 200 మంది దాకా థైరాయిడ్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ మేరకు వారి వద్దకు సగటున నెలకు 3 వేల మంది చికిత్స పొందుతున్నారు. మొత్తం థైరాయిడ్ రోగుల్లో 70 శాతం మంది హైపో థైరాయిడ్, 30 శాతం మందికి హైపర్ థైరాయిడ్ బాధితులు ఉంటున్నారు. ఈ ఆరోగ్య సమస్య పిల్లల నుంచి పెద్దల వరకు బాధిస్తోంది. స్త్రీలలో 20 శాతం, పురుషులలో 15 శాతం మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. వీరిలో కొందరికి గాయిటర్ (గొంతు వద్ద గడ్డ) ఉంటోంది. ఇలా కణితి ఉన్న వారికి ఆపరేషన్ అవసరం లేదు. క్యాన్సర్‌గా మారితేనే ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గడ్డలు ఏర్పడ్డ వారిలో 5 శాతం మందిలో మాత్రమే క్యాన్సర్ కణితులు ఉంటాయి. వీరికి మాత్రమే ఆపరేషన్ చేసి కణితి తొలగించాల్సి ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

పుట్టబోయే పిల్లలకు సమస్యలు

ఇటీవల కాలంలో గర్భిణుల్లో థైరాయిడ్ సమస్య బాగా ఇబ్బంది పెడుతోంది. గర్భిణీగా ఉన్నప్పుడు ఈ సమస్యను గుర్తించకపోతే వారికి పుట్టబోయే బిడ్డలకు భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వారిలో మేధోపరమైన సమస్యలు, ఎదుగుదల లోపాలు, శారీరక, మానసిక సమస్యలు వస్తాయని చెబుతున్నారు. కావున గర్భం దాల్చిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా థైరాయిడ్ పరీక్ష చేయించుకుని, వ్యాధి ఉంటే వైద్యుల సూచన మేరకు మందులు వాడాల్సి ఉంటుంది.

అయోడిన్ ఉప్పును వాడాలి



అయోడిన్ ఉప్పు సరిగ్గా వాడకపోయినా థైరాయిడ్ జబ్బు వస్తుంది. ఇప్పటికీ గ్రామాల్లో రాళ్ల ఉప్పు వాడుతున్నారు. అయోడిన్ కలిపిన ఉప్పునే కొని వాడాలి. ఉప్పు ఉంచిన డబ్బాను ఎప్పుడూ మూసి ఉంచాలి. లేకపోతే అయోడిన్ గాలిలో కలిసిపోతుంది. థైరాయిడ్ సమస్య ఉన్న వారు క్యాబేజీ, క్యాలీఫ్లవర్‌కు దూరంగా ఉండాలి. ఈ వ్యాధి బాధితులు వైద్యులు సూచించిన ప్రకారం మందులు వాడుతూ ఉంటే ఏమీ కాదు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో థైరాయిడ్ పరీక్ష ఉచితంగా నిర్వహిస్తున్నాం. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ పి.శ్రీనివాసులు, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

థైరాయిడ్ కణితిని నిర్లక్ష్యం చేయరాదు



థైరాయిడ్ బాధితుల్లో చాలా మందికి గొంతు వద్ద ఎలాంటి సమస్యా ఉండదు. కొందరికి మాత్రమే కణితి ఏర్పడి వాపు కనిపిస్తుంది. ఇది చిన్న సైజులో ఉన్నా, దాని వల్ల ఎలాంటి ఇబ్బంది లేకపోయినా మందులు వాడుతూ ఉంటే సరిపోతుంది. ఇలాంటి వారికి ఆపరేషన్ అవసరం లేదు. కణితి సైజు పెద్దగా ఉండి, క్యాన్సర్ లక్షణాలు ఉంటే మాత్రం వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకుని, ఆపరేషన్ ద్వారా కణితిని తొలగించుకోవడం మంచిది. లేకపోతే క్యాన్సర్‌గా మారి తీవ్ర ఇబ్బందులకు గురిచేసే ప్రమాదం ఉంది.

– డాక్టర్ ఏఎస్ భార్గవవ్యాస్, జనరల్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్, కర్నూలు

గణతంత్ర వేడుకలు వైభవంగా నిర్వహించాలి

- శాఖల వారీగా సమన్వయంతో అధికారులు పనిచేయాలి
- ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచనలు





మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వేడుకలను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ పతాకావిష్కరణ, బారికేడింగ్, వైట్‌వాష్ వంటి ఏర్పాట్లను పరేడ్ గ్రౌండ్‌లో సిద్ధం చేయాలన్నారు. అలాగే స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని, సీటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే పిల్లలు ఎక్కువసేపు ఎండలో నిలబడకుండా 30 నుంచి 45 నిమిషాల్లోపు సాంస్కృతిక కార్యక్రమాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ శామ్యూల్‌పాల్‌ను ఆదేశించారు. అన్ని శాఖల నుంచి ప్రభుత్వ పథకాల వివరాలను క్రోడీకరించి సందేశాన్ని రూపొందించాలని, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని సమాచార శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్‌లో తాగునీరు, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కమిషనర్ రవీంద్రబాబుకు సూచించారు. ప్రథమ చికిత్స కిట్‌తో వైద్య బృందం అందుబాటులో ఉండేలా వైద్య ఆరోగ్యశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి 26వ తేదీన ఉత్తమ ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాలకు సంబంధించి జాబితాను త్వరగా డీఆర్వో సి.వెంకటనారాయణమ్మకు అందజేయాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలును ప్రతిబింబించేలా శకటాలు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, అదనపు ఎస్పీ(అడ్మిన్) హుస్సేన్‌పీరా, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

19న కబడ్డీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి కబడ్డీ సీనియర్స్ పురుషుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి రాచపూడి సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరుకావాలని, బరువు 80 కిలోల్లోపు ఉండాలన్నారు. ఎంపికయిన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 97010 12329 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వలంటీర్ల ఉద్యమానికి అండగా నిలవాలి

- 2.60 లక్షల మంది వలంటీర్ల కడుపు కొట్టిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): ఎన్నికల ముందు గ్రామ/వార్డు వలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10 వేలు వేతనం ఇస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారిని తొలగించి మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. వలంటీర్ల ఉద్యమానికి వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలవాలని కోరారు. గురువారం స్థానిక సి క్యాంపులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 2.60 లక్షల మంది వలంటీర్ల కడుపు కొట్టిన ప్రభుత్వంపై ఉద్యమ బాట పట్టనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగులకు అండగా నిలవాలన్న సంకల్పంతో వలంటీర్లను నియమించి గౌరవ వేతనం ఇచ్చారన్నారు. అయితే మాజీ ముఖ్యమంత్రి ఉద్యోగాలు ఇచ్చాడన్న అక్కసుతో కూటమి ప్రభుత్వం వారిని తొలగించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నేరవేర్చేంత వరకు వలంటీర్లు చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు పూర్తి అండగా ఉంటామన్నారు. న్యాయమైన డిమాండ్‌పై వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు వారికి మద్దతుగా నిలవాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులు జాగ్రత్తలు పాటించాలి

కర్నూలు (టౌన్): నగరంలో తెల్లవారుజాము నుంచే విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. గురువారం స్థానిక ధర్మపేట, గాంధీనగర్, ఛత్రీబా గ్, బొంగుల బజార్ ప్రాంతాలలో కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు రోగాల బారిన పడకుండా రక్షణ దుస్తులు, చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు వంటివి ధరించాలన్నారు. ప్రజారోగ్యంతో పాటు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. తమకు కేటాయించిన కాలనీల్లో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ మండలాధ్యక్షుల ఎన్నిక

కల్లూరు: పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్, కల్లూరు గ్రామీణ, ఓర్వకల్లు మండలాలకు అధ్యక్ష ఎన్నికలు కల్లూరు అర్బన్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు అర్బన్–1 ఎస్.రామాంజనేయులు, కల్లూరు గ్రామీణ మండలానికి ఎస్.మధుకుమార్, ఓర్వకల్లు– ఎం.రఘురాముడులను మండలాల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ నాయకులు గీతా మాధురి, చెన్నయ్య, నాగరాజుయాదవ్ తెలిపారు. ఎన్నికైన వారికి పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మద్దిలేటి రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గంగాధర్, దిలీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కల్లూరు: విద్యుత్ శాఖలో చేపట్టనున్న అభివృద్ధి పనులలో భాగంగా శుక్రవారం కల్లూరు మండలం దూపాడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డీఈఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దూపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తిరుమలగిరి టౌన్ షిప్, గ్రీన్ ల్యాండ్, కృతింగా హోటల్, లక్ష్మీపురం, దూపాడు గ్రామాల్లోని తదితర కాలనీలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'బిసాన్ ఓవ్ డా' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: పాలస్తీనా ఇజ్రాయిల్ యుద్ధాన్ని రెండు దేశాల మధ్య యుద్ధంగా చూడకూడదని ప్రపంచంలో జరుగుతున్న సామ్రాజ్య వాదానికి ప్రతిబింబంగా చూడాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం బావర్చి ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ కవి చౌశా రచించిన బిసాన్ ఓవ్ డా పుస్తకాన్ని ఆర్థిక నిపుణులు డాక్టర్ మన్సూర్ రెహమాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చౌశా గొప్ప కవిత్వం రాశాడన్నారు. బిసాన్ ఓవ్ డా పాలస్తీనా జర్నలిస్ట్‌గా పని చేస్తూ యుద్ధాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా అందించడం ద్వారా అక్కడి విషయాలు మనకు తెలుస్తున్నాయన్నారు. ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవాలన్న సామ్రాజ్య వాద కాంక్ష ప్రమాదకరమన్నారు. దీనికి వ్యతిరేకంగా కవి చౌశా రచనలు సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత మహమ్మద్‌మియ్యా, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, కథా రచయిత ఇనాయతుల్లా, ప్రముఖ కవి వెంకటకృష్ణ, ఆవాజ్ కమిటీ నాయకులు ఇక్బాల్, కెంగార మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్.కొంతలపాడులో బురదమయంగా రోడ్డు

పడకేసిన పారిశుద్ధ్యం

కర్నూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మండలంలోని ఆర్.కొంతలపాడు గ్రామం కురువ కాలనీలో మురుగు నీరు ఇళ్ల ముందే రోడ్డుపై పారుతుండటంతో దుర్గంధం వెదజలుతోంది. దీంతో ఆ కాలనీ మీదుగా వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మురుగు నీటి వల్ల దోమలు, విషకీటకాల బారిన పడి ప్రజలు అనారోగ్యానికి గురౌతున్నారు. సమస్యను విన్నవించినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే ఉంచాలి

కర్నూలు (అగ్రికల్చర్): రాష్ట్రంలోని మూడు గ్రామీణ బ్యాంకులు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో విలీనమవుతున్నందున రాష్ట్రస్థాయి కార్యాలయాన్ని వైఎస్సార్ జిల్లా కేంద్రంలోనే కొనసాగించేలా చూడాలని బ్యాంకు ఉద్యోగ అధికార సంఘం ప్రతినిధులు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని కోరారు. గురువారం ఏపీజీబీ ఆఫీసర్స్, ఎంప్లాయీస్ సంఘాల ప్రతినిధులు హనుమంత్‌రెడ్డి, రియాజ్ బాషా, సురేష్, రమణారెడ్డి, గజేంద్ర రెడ్డి, సతీష్, రవి తదితరులు కర్నూలులోని నివాసంలో ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని కార్యాలయాలను అమరావతిలోనే కేంద్రీకరించాలని భావిస్తున్న నేపథ్యంలో నూతనంగా ఏర్పాటు కాబోతున్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కూడా అమరావతికే తరలిపోతుందనే ఆందోళన ఉందని పేర్కొన్నారు. దేశంలో ఏ గ్రామీణ బ్యాంకుకు లేనటువంటి కరెన్సీ చెస్ట్ సదుపాయం కేవలం ఏపీజీబీకే ఉందని, ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే సొంత భవనం ఉందని, వ్యాపార, వాణిజ్య పరంగా మిగిలిన గ్రామీణ బ్యాంకులతో పోలిస్తే ఏపీజీబీ మొదటి స్థానంలో ఉందని పేర్కొన్నారు. విలీనం తర్వాత అతి పెద్ద బ్యాంకుగా అవతరిస్తున్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని వైఎస్సార్ జిల్లాలోనే కొనసాగించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ స్పందిస్తూ.. సమస్యపై ముఖ్యమంత్రితో చర్చిస్తామని భరోసా ఇచ్చారు.

వినికిడి పరీక్ష యంత్రం విరాళం



సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు ఆడియోమెట్రి పరికరాన్ని అందజేస్తున్న డాక్టర్ లక్ష్మీప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అమీలియో హాస్పిటల్ యాజమాన్యం వినికిడి పరీక్ష యంత్రం (ఆడియోమెట్రి మిషన్)ను విరాళంగా అందజేసింది. గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు అమీలియో హాస్పిటల్ ఎండీ డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆడియోమెట్రి పరికరాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అడిగిన వెంటనే అమీలియో హాస్పిటల్ యాజమాన్యం ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన రూ.3.85 లక్షల విలువైన వినికిడి పరీక్ష యంత్రాన్ని విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డాక్టర్ వీరకుమార్ మాట్లాడుతూ.. ఇంపీడెన్స్ ఆడియోమెట్రి యంత్రంతో నొప్పిలేకుండా, నాన్‌వాసివ్ వినికిడి పరీక్ష చేయవచ్చన్నారు. ఇది వివిధ శబ్దాలను వినగల వ్యక్తి సామర్థ్యాన్ని కొలుస్తుందని చెప్పారు. రోగులకు వినికిడి లోపం ఉందో, లేదో తెలుసుకోవడానికి, శస్త్రచికిత్సకు ముందు, తర్వాత వారి వినికిడిని పర్యవేక్షించేందుకు ఆడియోమెట్రి పరీక్ష చేస్తారని వివరించారు. ఆసుపత్రికి వచ్చే సదరం రోగులకు కూడా దీనిని ఉపయోగిస్తామన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య, సీఎస్‌ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్లు పి.హరికృష్ణ, కె.మమత, పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని గుట్టపాడు వద్ద స్థాపిస్తున్న స్టీల్ ప్లాంట్ పరిశ్రమలో కాంట్రాక్టు కింద పనిచేస్తున్న ఎంఆర్ కంపెనీ గుర్తింపును రద్దు చేయాలని సీపీఐ, ఆర్‌వీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎంఆర్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారికి నెల రోజులుగా జీతాలు చెల్లించలేదని గురువారం స్టీల్ ప్లాంట్ ఎదురుగా చేపట్టిన ఆందోళనకు సీపీఐ, ఆర్‌వీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంఆర్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికుల జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ కంపెనీలో వంద మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చారని, అయితే ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగాలని చెప్పి, అక్కడ మాత్రం వేరే పనులు చేస్తున్నారని, జీతాలు ఇవ్వకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బైక్‌లపై వచ్చే వారికి కనీసం పెట్రోల్‌కు కూడా డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కంపెనీ యాజమాన్యం, ఉన్నతాధికారులు స్పందించి, కార్మికులకు నెలకు రూ.16 వేలు చొప్పున వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే అన్ని ప్రజా సంఘాలను కూడగట్టి ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కంపెనీ ప్రతినిధులు స్పందించి నెలకు రూ.15 వేలు వేతనం చెల్లించి, పెట్రోల్ ఖర్చులు ఇస్తామని భరోసా ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళనను విరమించారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి సుధాకర్, ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం



కాలిపోయిన సామగ్రి

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో కోడుమూరు వీరకోటికి చెందిన గుడిసె గురువారం దగ్ధమైంది. వీరకోటి కుటుంబం ఉదయం పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా గుడిసెకు మంటలు వ్యాపించడంతో గుడిసెలోని నిత్యావసర సరుకులు, వివిధ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. గుడిసె కాలిపోవడంతో వీరకోటి కుటుంబ రోడ్డున పడింది.

పౌర గుర్తింపు సర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర వ్యాప్తంగా పౌర గుర్తింపు సర్వేను వేగవంతం చేయాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. గురువారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ఇప్పటికే 80,553 మంది పౌరులు ప్రభుత్వ రికార్డుల్లో లేరని, వారిని గుర్తించి ఆయా సచివాలయాల పరిధిలో ఉన్నట్లు నిర్ధారించాలన్నారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. సచివాలయాల సిబ్బంది జాప్యం చేయకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, అధికారులు సాధిక్, ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కర్నూలు(సెంట్రల్): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మజఫర్ నగర్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గురువారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, నగర కార్యదర్శి హుస్సేన్‌బాషా హాజరై విజేత జట్టుకు రూ.5 వేలు, రన్నరప్ జట్టుకు రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో వినోద్, ధను, సూరి, శ్రావణ్, అఖిల్, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం

వెల్దుర్తి: స్థానిక హైస్కూల్ 2000–01 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు, సురేశ్ ఎలెవన్ టీం సంయుక్తంగా పట్టణంలోని బాలుర హైస్కూల్ మైదానంలో జిల్లా స్థాయి సూపర్–8 క్రికెట్ టోర్నీని ఏఎస్ఐ శివరామిరెడ్డి గురువారం ప్రారంభించారు. హెడ్ కానిస్టేబుళ్లు నరసింహులు, శ్రీను, నిర్వాహకులు శ్రీనివాసులు, సురేశ్, సుమన్, రాహుల్, అనూప్, సూరి, ముత్యాల సుమన్, నగేశ్, మధు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్
శ్రీరామ : సంక్రాంతికి వస్తున్నాం
రాజ్ : సంక్రాంతికి వస్తున్నాం
భరత్ కాంప్లెక్స్ : పుష్ప–2, యుఐ
విజయ థియేటర్ : డాకు మహరాజ్
విక్టరీ టాకీస్ : మార్కో